సాక్షి ఆదిలాబాద్

సోమవారం | 13 | అక్టోబర్ | 2025



కేజీబీవీల నిర్వహణ ఎలా?

కేజీబీవీల నిర్వహణ భారంగా మారుతోంది. నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నెలవారీ అవసరాలు తీర్చేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. 8లో▸



చదువులు చెప్పలేం..!

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లోని విద్యార్థుల చదువులకు ఆటంకమేర్పడుతోంది. ప్రభుత్వం పాఠశాలల ఫీజు బకాయిలు చెల్లించకపోవడమే ఇందుకు కారణం. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/22.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉపఎన్నిక ఇన్‌చార్జీల నియామకం



కేటీఆర్‌తో అనిల్ జాదవ్, జాన్సన్ నాయక్

నేరడిగొండ: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో రెహమత్‌నగర్ డివిజన్ ఇన్‌చార్జీలుగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, పార్టీ ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. పలు బూత్‌ల బాధ్యతలు అప్పగించి విజయ వ్యూహంతో ముందుకుసాగాలని ఈ సందర్భంగా కేటీఆర్ సూచించినట్లు వారు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

బేల: మండలంలోని సదల్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని భైరందేవ్ ఆలయంలో ఆదివారం నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వీరిద్దరినీ శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఆలయ అర్చకుడు వెంక్రటావు, బీజేపీ నాయకులున్నారు.

లక్ష్మీనారాయణుడిపై సూర్యకిరణాలు



విగ్రహాన్ని తాకుతున్న సూర్యకిరణాలు

జైనథ్: మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి స్వామివారి మూల విరాట్టుపై సూర్యకిరణాలు పడుతున్నాయి. స్వామివారి పాదాల నుంచి విగ్రహం మొత్తం తాకుతూ వెళ్తుంటాయి. సూర్య కిరణాలు తాకుతున్న సమయంలో స్వామివారు సువర్ణ ఆకృతితో భక్తులకు దర్శనమిస్తారు. ఈ సమయంలో స్వామివారిని దర్శించుకుంటే సకల దోషాలతో పాటు చర్మవ్యాధులు తొలగుతాయని భక్తుల నమ్మకం. కుటుంబ సభ్యుల్లో సుఖఃశాంతులు కలుగుతాయని విశ్వాసం. కాగా, అక్టోబర్, ఫిబ్రవరి నెలల్లో ఏటా రెండుసార్లు విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకుతూ ఉంటాయి.

జూనియర్ అసిస్టెంట్ల క్రమబద్ధీకరణ

- జిల్లాలో 51 మందికి ప్రయోజనం

కైలాస్‌నగర్: గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తూ వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థ రద్దుతో రెవెన్యూ శాఖలో విలీనమై జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న వారి సర్వీస్ క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైంది. రెండేళ్ల సర్వీస్ పూర్తి కావడంతో తమ ప్రొబేషనరీ పీరియడ్‌ను ప్రకటించాలంటూ వారు ప్రభుత్వానికి పలుసార్లు విన్నవించారు. ఎట్టకేలకు స్పందించిన సీసీఎల్ఏ వారి సర్వీస్ క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రక్రియ చేపట్టాలని ఆదేశిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సీసీఎల్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా కలెక్టర్ ఆధ్వర్యంలో సర్వీస్ క్రమబద్ధీకరణకు కసరత్తు చేపట్టనున్నారు. తాజా నిర్ణయంతో జిల్లాలోని 51మంది జూనియర్ అసిస్టెంట్లకు ప్రయోజనం చేకూరనుంది.

మావలలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో నిమజ్జనానికి వెళ్తున్న మహిళలు

ఆదిలాబాద్‌రూరల్: మావల గ్రామంలో బతుకమ్మ సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలు అందంగా పేర్చారు. అనంతరం బతుకమ్మలను ఒక్కచోట చేర్చి డీజే చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఆడిపాడారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువులో వాటిని నిమజ్జనం చేశారు.

ఆ నాలుగూ ప్రత్యేకమే..

- యూజ్ కేస్ చాలెంజ్‌లో నార్నూర్ ఆస్పిరేషనల్ బ్లాక్‌కు అవార్డులు
- జిల్లాకు దక్కిన అరుదైన గుర్తింపు
- కలెక్టర్ పాలన దక్షతకు నిదర్శనం

నార్నూర్ ఆస్పిరేషనల్ బ్లాక్ వివరాలు	
గ్రామాలు	24
కుగ్రామాలు	34
జనాభా	29,152
పీహెచ్‌సీలు	1
అంగన్‌వాడీ కేంద్రాలు	77



ఆరోగ్య పాఠశాల స్టూడెంట్ చాంపియన్లతో కలెక్టర్ రాజర్షి షా (ఫైల్)

కైలాస్‌నగర్: జిల్లాకు మరోసారి జాతీయస్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆస్పిరేషనల్ బ్లాక్‌లలో భాగంగా నీతి ఆయోగ్ చేపట్టిన 'యూజ్ కేస్ చాలెంజ్'లో జిల్లా ఏకంగా నాలుగు అంశాల్లో పురస్కారాలు సాధించింది. నార్నూర్ ఆస్పిరేషనల్ బ్లాక్‌లో విద్య, సామాజికాభివృద్ధి, ఆరోగ్యం, పోషణ విభాగాల్లో సాధించిన ప్రగతికి గాను అవార్డులతో పాటు నగదు పురస్కారాన్ని అందుకోవడం కలెక్టర్ రాజర్షి షా సమర్థతకు నిదర్శనం. ఇదివరకే ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుని జాతీయస్థాయిలో జిల్లా ఖ్యాతిని చాటిచెప్పారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేలా..

నార్నూర్ మండలంలోని 34 ప్రభుత్వ పాఠశాలల్లోని 202మంది పేద విద్యార్థుల ఇంగ్లిష్ నైపుణ్యాన్ని పెంచేలా 'ఇంప్రూవింగ్ సాఫ్ట్ స్కిల్స్ అ మాంగ్ద స్టూడెంట్స్' థీమ్ అమలు చేశారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచడం, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం తదితర స్కిల్స్ పెంచేదిశగా ప్రత్యేక శ్రద్ధ వహించారు. ముఖ్యంగా నార్నూర్ బ్లాక్ పరిధిలో ఇంగ్లిష్ ఫౌండేషన్ లెర్నింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చేలా బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించారు. టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రత్యేక మాడ్యుల్స్‌ను అందజేసి పక్కాగా అమలుపరిచారు. ఇదీ విజయవంతమై విద్యార్థుల భాషా నైపుణ్యం మెరుగుపడేలా చేసింది. ఇందుకు రూ.2లక్షల నగదు బహుమతి సాధించింది.

విద్యా విభాగంలో..

సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థుల్లోని చెడు అలవాట్లను దూరం చేసి చదువులో రాణించేలా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేకంగా ఆరోగ్య పాఠశాలను అమలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 81 పాఠశాలల్లో దీన్ని అమలు చేస్తుండగా 39వేల మంది విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నిత్యం రోజుకో అంశంలో తర్ఫీదునిస్తున్నారు. గుట్కా, పాన్, తంబాకు లాంటి వాటిని వాడకుండా చూడటంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అనుసరించాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యతను చాటి చెబుతున్నారు. వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్నారు. దీన్ని నార్నూర్ బ్లాక్‌లోనూ పటిష్టంగా అమలుచేశారు. ప్రతీ వారం విద్యార్థులు, టీచర్లతో కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తూ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ఆరోగ్యపరంగా గణనీయమైన మార్పులను తీసుకువచ్చింది. విద్యార్థులతో పాటు వారి కుటుంబీకులు చెడు అలవాట్లు మానుకునేలా తోడ్పడింది. ఈ కార్యక్రమానికీ రూ.లక్ష పురస్కారం అందుకుంది.

సామాజికాభివృద్ధి విభాగంలో..

నార్నూర్ ఆస్పిరేషనల్ బ్లాక్‌కు ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించారు. ఈ బ్లాక్ పరిధిలో విద్య, వైద్యం ఆరోగ్యం, పోషకాహారంతో పాటు వ్యవసాయం, ఆర్థిక చేయూత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు లాంటి వివరాలన్నింటినీ అందులో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. ఆయా వివరాలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏ విధంగా అమలవుతున్నాయి.. జిల్లా స్థాయిలో వాటి అమలు ఎలా ఉందనే దానిపై పూర్తి గణాంకాలతో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. నీతి ఆయోగ్ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేస్తూ వివరాలు పొందుపరుస్తున్నారు. ఆయా ప్యారామీటర్లను గణాంకాలతో నిర్దేశించుకుని జిల్లాకు అవార్డు, రూ.లక్ష నగదు పురస్కారం ప్రకటించారు.



జిల్లాకు నీతి ఆయోగ్ అందజేసిన అవార్డు జ్ఞాపిక

ఆరోగ్యం, పోషణలో...

ఆరోగ్య ప్రమాణాలను పెంచడంతో పాటు చిన్నారులు, విద్యార్థులకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించేలా పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేశారు. జిల్లాలోని 17 కేజీబీవీల్లో చదివే విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేసి వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యతను తెలియజేశారు. 10వేల మంది విద్యార్థినులకు ప్రయోజనం చేకూర్చేలా 40 పాఠశాలల్లో శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మిషన్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నారు. నార్నూర్ బ్లాక్‌లో మూడు హ్యాబిటేషన్లలో టెలి మెడిసిన్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. తాగునీటి వసతి కలిగిన అంగన్‌వాడీ కేంద్రాలు రాష్ట్రస్థాయిలో 47.6శాతం ఉండగా నార్నూర్‌లో వందశాతం, మరుగుదొడ్డి ఉపయోగించే కేంద్రాలు రాష్ట్రంలో 36.8శాతం ఉంటే నార్నూర్‌లో 32.46 శాతంగా ఉన్నాయి. ఐదేళ్లలోపు చిన్నారుల్లో పోషకాహారలోపం రాష్ట్రస్థాయిలో 3.3 శాతంగా ఉంటే నార్నూర్ బ్లాక్‌లో 2.70శాతానికి తగ్గించారు. ఐదేళ్లకు పైబడిన చిన్నారుల్లో తీవ్రమైన పోషకాహారలోపం రాష్ట్రస్థాయిలో 1.1శాతంగా ఉండగా నార్నూర్ బ్లాక్‌లో 0.5 శాతానికి తగ్గించారు. 2,500 గ్రాముల కంటే తక్కువ బరువుతో జన్మించిన శిశువుల శాతం రాష్ట్రంలో 7.8శాతం ఉండగా ఈ బ్లాక్‌లో జీరోకు తగ్గించారు. అలాగే ఆస్పత్రి ప్రసవాలు రాష్ట్రంలో 87.8శాతం ఉండగా జిల్లాలో వందశాతం జరిగేలా శ్రద్ధ వహిస్తున్నారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లు 87.8శాతం ఉండగా జిల్లాలో వందశాతానికి తీసుకువచ్చారు. పోషణ్ అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్, ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసి రూ.లక్ష నగదు పురస్కారాన్ని సాధించారు.

ప్లానింగ్ పక్కాగా..

- ఉపాధిహామీకి యుక్తధార పోర్టల్
- కేంద్రం నుంచి ఉత్తర్వులు జారీ
- ఇక నుంచి పనుల మంజూరు, బిల్లుల చెల్లింపు దీని ద్వారానే..



శాటిలైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పని ప్రదేశం (ఫైల్)

కైలాస్‌నగర్: ఉపాధిహామీ పథకం అమలులో అక్రమాలను కట్టడి చేసేందుకు కేంద్రం అనేక సంస్కరణలు తీసుకువస్తోంది. తాజాగా ఒకేచోట పనులు చేపట్టడానికి ఆస్కారం లేకుండా పనుల ప్లానింగ్‌ను పక్కాగా అంచనా వేసేందుకు యుక్తధార జియో స్పెషియల్ ప్లానింగ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) భువన్ పోర్టల్ ఆధారంగా అధికారులు పనులను ఆన్‌లైన్‌లో గుర్తించనున్నారు. అంచనాల తయారీ నుంచి పనుల మంజూరు, బిల్లుల చెల్లింపు లాంటి పనులన్నీ ఇక నుంచి ఈ పోర్టల్ ద్వారానే జరగనున్నాయి. దీంతో అక్రమాలకు పూర్తిగా చెక్‌పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అక్రమాలకు తావు లేకుండా..

ఉపాధిహామీలో కొన్నిచోట్ల పనులు చేయకున్నా చేసినట్లు రికార్డులు నమోదు చేసి క్షేత్రస్థాయిలో కొందరు సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. సోషల్ ఆడిట్‌లోనూ ఇలాంటివి బయటపడుతున్నాయి. ఇందుకు తావులేకుండా యుక్తధార పోర్టల్ తోడ్పడనుంది. గ్రామాల్లో పనులు చేపట్టే ప్రాంతాలను ఈ యాప్‌లో ఆన్‌లైన్ ద్వారా లైవ్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇస్రో భువన్ పోర్టల్ ద్వారా చేపట్టనుండగా ఇదివరకు ఆ ప్రాంతంలో పనులు చేపట్టారా.. పనులు చేసేందుకు ఆ ప్రాంతం అనుకూలంగా ఉందా.. లేదా? అనే వివరాలు చెప్పడంతో పాటు ఆ ప్రాంతం ఫొటోలనూ ప్రత్యక్షంగా చూపిస్తుంది. దీంతో పనులు చేపట్టే ప్రాంతాలనే ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాంతాలను గుర్తించే పనిలో టెక్నికల్ అసిస్టెంట్లు నిమగ్నమయ్యారు. ఏ విధంగా పనుల అంచనాలు గుర్తించాలనేదానిపై ఇదివరకే అధికారులు వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పనులు మంజూరయ్యాక నిర్దేశిత ప్రాంతంలోనే పనులు చేయాల్సి ఉంటుంది. పనులు చేయకముందు ఒకసారి, 60శాతం పనులు పూర్తయ్యాక, 90 నుంచి వంద శాతం పనులు పూర్తయ్యాక ఇలా మూడు సార్లు ఆ ప్రాంతం ఫొటోలు తీసుకుంటారు. దాన్ని నిర్ధారించాకే కూలీలకు బిల్లులు మంజూరవుతాయి.

గ్రామానికో లాగిన్ ఐడీ

వచ్చే ఆర్థిక సంవత్సరంలో టెక్నికల్ అసిస్టెంట్లు జిల్లాలో ఎలాంటి పనులు చేపట్టాలో గుర్తించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీ గ్రామానికో లాగిన్ ఐడీని క్రియేట్ చేశారు. వాటి ఆధారంగా యుక్తధార పోర్టల్‌లో పనులు చేపట్టే ప్రాంతాలను వారు నమోదు చేయనున్నారు. ఈ ప్రక్రియ సోమవారం నుంచి మొదలయ్యే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామానికి సంబంధించి ఉపాధి పనులకు హాజరైన కూలీల మూడేళ్ల వివరాలు తీసుకుంటారు. అందులో సంవత్సరం వారీగా ఎంతమంది పనులకు వచ్చారనే వివరాలను యావరేజ్‌గా తీసుకుని చేపట్టాల్సిన పనులు, మెటీరియల్ కాంపొనెంట్‌ను కలిపి లేబర్ బడ్జెట్ ప్రణాళికను సిద్ధం చేస్తారు. ఈ వివరాల ఆధారంగా పనులు మంజూరు చేయడంతో పాటు బడ్జెట్ కేటాయింపులు, కూలీలకు బిల్లుల చెల్లింపులు తదితర పనులన్నీ ఇక నుంచి ఈ పోర్టల్ ద్వారానే చేపట్టనున్నారు. నేరుగా కేంద్రమే వీటిని పర్యవేక్షించనుంది. ఫలితంగా రాష్ట్ర ప్రమేయం తగ్గి అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది.

17 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా..

యుక్తధార పోర్టల్‌ను అమలు చేసేందుకు పైలెట్ ప్రాజెక్ట్ కింద గతేడాది మండలానికో గ్రామం చొప్పున జిల్లాలోని 17 గ్రామాలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో అంకాపూర్, బేల మండల కేంద్రం, జైనథ్‌లో నిరాల, తలమడుగులో కుచులాపూర్, తాంసిలో జామిడి, నార్నూర్‌లో గుంజాల, ఇంద్రవెల్లిలో దేవాపూర్, గుడిహత్నూర్‌లో శంభుగూడ, ఇచ్చోడలో బోరిగామ, బజార్‌హత్నూర్‌లో దహెగాం, బోథ్‌లో కౌట, ఉట్నూర్‌లో ధన్‌పూర్, నేరడిగొండలో కుంటాల-కే, భీంపూర్‌లో మర్కగూడ, గాదిగూడలో పర్సువాడ (కే), మావలలో వాగాపూర్, సిరికొండలో రిమ్మ గ్రామాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఆయాచోట్ల ఈ విధానం విజయవంతం కావడంతో ప్రస్తుతం ప్రతీ గ్రామంలో దీనిని అమలు చేయనున్నారు.

పారదర్శకత పెంచేందుకే..

ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత పెంచాలనే ఉద్దేశంతోనే కేంద్రం యుక్తధార పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. గ్రామ భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా పనులు చేపట్టేందుకు అవకాశం ఉందా.. అనేదాన్ని శాటిలైట్ ద్వారా గుర్తించి ప్రాంతాలను ఎంపిక చేయనున్నాం. గతంలో కొండ ప్రాంతాల్లో ఇంకుడుగుంతలు, ఫాంపాండ్స్ లాంటి నిర్మాణాలు చేపట్టారు. అలాంటి అవకాశం లేకుండా ఎత్తు, పల్లాలను గుర్తించి పనులు చేసేందుకు వాస్తవంగా అవకాశం ఉందా.. అనే దాన్ని గుర్తించేందుకు ఈ విధానం తోడ్పడుతుంది.

– కుటుంబరావు, అడిషనల్ డీఆర్డీవో

రియల్ ఎస్టేట్ ముఠా భారీ కుంభకోణం

- ఈడీ, ఎస్‌బీఐ అధీనంలోని రూ.కోట్ల విలువైన భూమి కబ్జా
- ఇద్దరు నిందితుల రిమాండ్
- మరో ఎనిమిది మంది పరారీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఈడీ, బ్యాంక్ అధీనంలోని రూ.కోట్ల విలువైన భూములను నకిలీ పత్రాలతో కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ ముఠా బండారం బయటపడింది. ఇందులో ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేసి 14రోజుల పాటు రిమాండ్‌కు తరలించారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆదివారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోర్టు ద్వారా నియమించబడిన అధికారి దుమ్మటి సూర్య రామకృష్ణ సాయిబాబా భూముల కబ్జాకు సంబంధించి ఈనెల 10న ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ప్రకారం.. మనోజ్ కుమార్ అగర్వాల్ అనే వ్యక్తి సర్వే నంబర్ 65/బీ, 65/4లోని 2.09 ఎకరాలను జీఎస్ ఆయిల్‌మిల్స్ పేరుతో ఎస్‌బీఐలో మార్టిగేజ్ చేసి రుణం తీసుకున్నారు. 2012లో అదే వ్యక్తి 65/4/1 సర్వే నంబర్‌లోని భూమిని నలుగురికి విక్రయించగా, ఆ తర్వాత 2013లో అదే భూమిని డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు. జీపీఏ ఆధారంగా పూనమ్ వ్యాస్‌కు, తర్వాత ఆమె అనుపమ వ్యాస్‌కు అమ్మినట్లు తేలింది. అలాగే 2023లో రమేశ్ శర్మ, అతని కుమారుడు రాకేశ్‌శర్మ, ఇబ్రహీం మహ్మద్ అలియాస్ మామ్లా సేట్ తదితరులు నకిలీ పత్రాలు సృష్టించి తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సర్వే అధికారుల సహకారంతో సప్లిమెంటరీ సేత్వార్ పొందారు. 2024 నవంబర్ 18న నిందితులు జేసీబీలు, టిప్పర్లతో మొరం పోసి చదును చేసి ఆక్రమించారు. అప్పటికే ఆ స్థలం ఈడీ అధీనంలో ఉంది. అక్కడ రిటైర్డ్ ఎస్సై రాములు భద్రత సిబ్బందిగా ఉన్నారు. రాములు అడ్డుకునేందుకు ప్రయత్నించగా నిందితులు అతడిని చంపేస్తామని బెదిరించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ కె.ఫణీదర్ చర్యలు చేపట్టారు.


నిందితులు వీరే..

ఈ కేసులో హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు రమేశ్‌శర్మ, భుక్తాపూర్‌కు చెందిన ఇబ్రహీం మహ్మద్ అలియాస్ మామ్లా సేట్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరితో పాటు నిందితులు యతేంద్రనాథ్, హితేంద్రనాథ్, రాకేశ్ శర్మ, మనోజ్‌కుమార్ అగర్వాల్, పూనమ్ వ్యాస్, అనుపమ వ్యాస్, సర్వేయర్ శివాజీపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

నకిలీ పత్రాలతో భూ ఆక్రమణ

రమేశ్‌శర్మ సర్వే నంబర్ 65/బు/1 పేరుతో నకిలీ సేత్వార్ సృష్టించి ఈడీ అధీనంలోని భూమి స్వాధీనం చేసుకున్నాడు. కలెక్టర్ విచారణలో ఈ కుంభకోణం వెలుగులోకి రాగా రిజిస్ట్రేషన్లు, సేత్వార్‌లు రద్దు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ ఆధారాలతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రధాన నిందితులు రమేశ్‌శర్మ, ఇబ్రహీం మహ్మద్‌ను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో సర్వే అధికారుల సహకారం, సేత్వార్ జారీ ప్రక్రియపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు డీఎస్పీ వివరించారు.

'కేంద్ర పథకాలతో ప్రయోజనం శూన్యం'



సమావేశంలో మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ పథకాలతో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న విమర్శించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతు వ్యతిరేక విధానాలతో విఫలమైన మోదీ ప్రభుత్వం ఇప్పుడు పథకాల పేర్లు మార్చి మళ్లీ రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో మాత్రం రైతుల సంఖ్య 59లక్షల నుంచి 33లక్షలకు పడిపోయిందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ధన్, ధాన్య కృషి యోజనలో జిల్లాను చేర్చకపోవడం స్థానిక బీజేపీ ప్రజాప్రతినిధుల వైఫల్యమని విమర్శించారు. వరదలతో పంట నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు పరిహారం ఇవ్వకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఎరువులు, విత్తనాలు, మందులపై సబ్సిడీ తగ్గించి, ధరలు పెంచుతూ రైతుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు కుమ్రా రాజు, గంగయ్య, ధమ్మపాల్, కనక రమణ, శుక్లల్, అశోక్, భూమన్న తదితరులున్నారు.

దండారీ ఉత్సవాలకు సన్నద్ధం



కేస్లాపూర్‌లో పర, వెట్టేలను సిద్ధం చేస్తున్న దేవ్‌రావ్



దుర్వగూడలో టోపీల తయారీలో శ్యామ్‌రావ్

దీపావళి పండుగను పురస్కరించుకుని ఈ నెల 14నుంచి ప్రారంభమయ్యే దండారీ ఉత్సవాల నిర్వహణకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. గుస్సాడీ వేషధారణ కోసం నెమలి ఈకల టోపీలు, సంప్రదాయ వాయిద్యాలపై పర, వెట్టే, గుమ్మేల, డప్పుల తయారీలో నిమగ్నమయ్యారు. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌కు చెందిన మెస్రం జంగు, పెందోర్ దేవ్‌రావ్, దుర్వగూడకు చెందిన పుసం యేశ్వంత్‌రావ్, దుర్వ గంగారాం గుస్సాడీ టోపీలు, డప్పులు తయారు చేయడంతో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీలు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. కాగా, వీటి తయారీతో తమకు ఉపాధి దొరుకుతుందని వారు తెలిపారు.

– ఇంద్రవెల్లి

ఉపాధ్యాయుల లెర్నింగ్ టూర్!

తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో అంతర్జాతీయ ప్రమాణాలను ప్రవేశపెట్టేందుకు మరో అడుగు వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యతను పెంపొందించేలా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను విదేశాలకు పంపించాలని నిర్ణయించింది. 'గ్లోబల్ లెర్నింగ్ టూర్' పేరిట సుమారు 160 మందిని సింగపూర్, ఫిన్లాండ్, వియత్నాం, జపాన్ వంటి దేశాలకు పంపనుంది. వీరు ఆయా దేశాల్లో విద్యా విధానాలను ప్రత్యక్షంగా అధ్యయనం చేయనున్నారు. దీంతో విద్యావ్యవస్థ కొత్త పుంతలు తొక్కుతుందని విద్యావేత్తలు భావిస్తున్నారు.

- వినూత్న విద్యాబోధనపై అధ్యయనానికి పలు దేశాల్లో ఐదు రోజుల పర్యటన
- జిల్లాకు ముగ్గురి చొప్పున ఎంపిక
- ఉమ్మడి జిల్లా నుంచి 12మందికి ఛాన్స్



నిర్మల్ జిల్లా కొరటికల్ కాంప్లెక్స్ పాఠశాల విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు డాక్టర్ ఈ.నవీన్ నికోలస్ ఉపాధ్యాయుల విదేశీ టూర్‌కు సంబంధించిన మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులు రెండురోజుల క్రితం జారీ చేశారు. నవంబర్‌లో ఒక్కో బృందానికి 40మంది చొప్పున నాలుగు బృందాల్లో 160 మంది ఐదు రోజులపాటు సింగపూర్, వియత్నాం, జపాన్, ఫిన్లాండ్ దేశాల్లో పర్యటించనున్నారు. అక్కడి పాఠశాలల బోధన విధానం, విద్యార్థి-ఉపాధ్యాయ సంబంధాలు, సాంకేతిక వినియోగం వంటి అంశాలను అధ్యయనం చేసి తిరిగి వచ్చాక రాష్ట్రంలో అమలు చేసేలా మార్గదర్శకాలు రూపొందించనున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి 12 మంది..

ఉమ్మడి జిల్లాలో నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల నుంచి ముగ్గురి చొప్పున మొత్తం 12మంది విదేశీ పర్యటనలో భాగం కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 2,855 ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలలు ఉండగా దాదాపు 12వేల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి బృందంలో ఆయా దేశాల్లో పర్యటించి అక్కడి బోధన విధానాలను అధ్యయనం చేయనున్నారు.

ఎంపిక ప్రక్రియ ఇలా..

బోధన రంగంలో కనీసం పదేళ్ల అనుభవం, 55 ఏళ్ల లోపు వయస్సు, పాస్‌పోర్టు కలిగి ఉన్నవారు ఈ పర్యటనకు అర్హులు. కలెక్టర్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్, డీఈవో, జిల్లాస్థాయి సీనియర్ అధికారులు సభ్యులుగా ఉన్న కమిటీ జిల్లాకు ముగ్గురు చొప్పున ఉత్తమ టీచర్ల పేర్లను ఎంపిక చేయనుంది. ఇందుకు గానూ మూడేళ్లలో వారి పనితీరు పరిశీలిస్తారు. 'పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచడంలో తీసుకున్న చొరవ, విద్యార్థుల సంఖ్య పెంచడం, వృత్తిపరంగా అభివృద్ధి, పాఠశాల అభివృద్ధికి తీసుకున్న చర్యలు, వినూత్న బోధన పద్ధతులు, సాధించిన పురస్కారాలు, ఆంగ్లంలో సంభాషించే సామర్థ్యం' అనే ఏడు కొలమానాల ఆధారంగా జిల్లా కమిటీ టూర్‌కు వెళ్లే ఉపాధ్యాయులను ఎంపిక చేస్తుంది. ఈ ఎంపిక ప్రక్రియ ఈనెల 23 లోపు పూర్తి చేస్తారు.

పెద్దగా ఒరిగేదేం ఉండదు



జిల్లాకు ముగ్గుర్ని ఎంపిక చేసి విదేశాలకు పంపడం వల్ల ఇక్కడి విద్యావిధానంలో పెద్దగా ప్రయోజనాలేం ఉండకపోవచ్చు. మన దేశంలోనే వివిధ రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న విద్యాబోధన ప్రక్రియలు అధ్యయనం చేయడం మేలు. ఆయా దేశాల్లో సామాజిక ఆర్థిక కోణాలు మన దేశానికి భిన్నంగా ఉంటాయి. కాబట్టి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇక్కడి పొరుగు రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయడం సమంజసంగా ఉంటుంది.

– దాసరి శంకర్, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు, నిర్మల్

విప్లవాత్మక మార్పులకు అవకాశం



ఎంపికైన ఉపాధ్యాయులు విదేశాల్లోని విద్యా విధానాలు, బోధన పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా నూతన విషయాలు తెలుసుకుంటారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా గ్రహించిన అంశాలను అమలుపరచడం ద్వారా ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విప్లవాత్మక మార్పులకు అవకాశం ఉంటుంది.

– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్

క్లుప్తంగా

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



జుమ్మిడి మధుకర్ (ఫైల్)

దహెగాం: మండలంలోని బోర్లకుంట గ్రామానికి చెందిన జు మ్మిడి మధుకర్ శుక్రవారం వా గులో గల్లంతైన విషయం తెలి సిందే. అతని ఆచూకీ కోసం మూడు రోజులుగా గజ ఈతగాళ్లు వెతుకుతుండగా ఆదివారం మృతదేహం లభించింది. డీఎస్పీ వహీదుద్దీన్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. కోత్మీర్, బీబ్రా గ్రామాల మధ్యలో వాగులో మృతదేహం లభ్యమైందని ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బోటు సహాయంతో గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మృతుడి సోదరుడు దామాజీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థికి పాముకాటు



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్:పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర వసతి గృహంలో 7వ తరగతి చదువుతున్న ఆదె విజయ్ శనివారం రాత్రి మూత్రవిసర్జన కోసం బయటకు వెళ్లగా పాము కాటేసింది. స్పందించిన హాస్టల్ సిబ్బంది స్పందించి ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హ రీశ్ బాబు ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

అడెల్లిలో పోటెత్తిన భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహా పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శనివారం రాత్రి నుంచే అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వైన్స్ తరలించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వైన్స్ షాప్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారిపై పాఠశాలకు దగ్గర ఉన్న వైన్స్ షాప్ కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మందుబాబులు హల్‌చల్ చేస్తుండటంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారన్నారు. వైన్స్‌ను వెంటనే వేరే ప్రాంతానికి తరలించాలన్నారు. మాజీ సర్పంచ్ గంగారెడ్డి, నరసింహారెడ్డి, విజయ్, కొండుగారి నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారిదోపిడీ నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: దారిదోపిడీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని డాల్డా కంపెనీ ప్రాంతానికి చెందిన మోజే వికాస్ హోల్‌సెల్ కిరాణ షాపు సంబంధించి వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 7న సాయంత్రం దేవాపూర్ చెక్‌పోస్టు దాటాక ఎక్స్ రోడ్ సమీపంలోని జాతీయ రహదారి 44పై ఇచ్చోడకు చెందిన కేంద్రె శంకర్, బజార్‌హత్నూర్‌కు చెందిన జాదవ్ అంకుష్, ముండె సచిదానంద్‌లు బాధితుడిపై దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ.4లక్షలు దోచుకున్నారు. ఆ తర్వాత బైక్‌పై వేగంగా వెళ్లారు. దీంతో బాధితుడు అధైర్యపడకుండా వారిని వెంబడించాడు. వందకు పైగా స్పీడ్‌తో బైక్‌పై వెళ్తున్నప్పటికీ సెల్‌ఫోన్‌లో వారి దృశ్యాలను రికార్డు చేశారు. గమనించిన దుండగులు వారి బైక్‌ను బట్టిసావర్గాం సమీపంలో వదిలివెళ్లి పారిపోయారు. బాధితుడు బైక్ ఫొటోలు తీసి మావల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదివరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, ఆదివారం మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. వారి వద్ద రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి సాహసాన్ని అందరు మెచ్చుకుంటున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ముధోల్: బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన నర్సయ్య ఆదివారం భైంసా నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. మండలంలోని విటోలి గోదాం వద్ద మరో వాహనాన్ని తప్పిస్తుండగా బైక్ అదుపుతప్పి పంట పొలంలోకి వెళ్లింది. దీంతో నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.

కేజీబీవీల నిర్వహణ ఎలా?

- నాలుగు నెలలుగా పెండింగ్ బిల్లులు
- సరుకులు సరఫరా చేయని కాంట్రాక్టర్లు

మంచిర్యాల జిల్లాలో	కేజీబీవీలు	బాలికలు
	18	4587



దండేపల్లి కస్తూర్బా బాలికల విద్యాలయం

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీల్లో నిర్వహణ భారంగా మారుతోంది. పౌష్టికాహారం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన బోధన, వసతితో కూడిన విద్యతో మంచి ఫలితాలు రావడం.. విద్యార్థుల సీట్లు దొరకని పరిస్థితి. ప్రభుత్వం వారికి పౌష్టికాహారం అందించేందుకు కొత్త మెనూ అమల్లోకి తెచ్చిన.. టెండర్ల ఖరారులో మాత్రం నిర్లిప్తత చోటు చేసుకుంది. ఇదివరకు కాంట్రాక్టర్లు సరఫరా చేసిన సరుకులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులకు ఒత్తిడి చేస్తుండగా.. నెలవారీ అవసరాలకు నిధుల్లేక నిర్వహణ స్పెషల్ ఆఫీసర్లకు చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. వచ్చే వేతనాలు తక్కువంటే అందులో మెయింటెనెన్స్‌కు చేతి నుంచి పెట్టాల్సి వస్తుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి.

టెండర్‌లో ఖరారులో తాత్సారం

కస్తూర్బాల్లో చదువుతున్న బాలికలకు ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచింది. పౌష్టికాహారం కోసం చార్జీలు 6, 7 తరగతులకు రూ.1330, 8, 9, 10 తరగతులకు రూ.1540, ఇంటర్ చదివే బాలికలకు రూ. 2100 డైట్ చార్జీలు ఉన్నాయి. కాస్మెటిక్ చార్జీలు 6 నుంచి 8 వతరగతి వరకు రూ.100 నుంచి రూ.175, 8 నుంచి 10వ తరగతి ఆపై 11 సంవత్సరాల వయస్సు కలిగిన వారందరికి రూ.100 నుంచి రూ.275కు పెరిగాయి. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచిపోయిన కొత్తగా ఎగ్స్, పాలు టెండర్లు మాత్రం పూర్తి చేశారు. కూరగాయలు, నిత్యావసర సరుకులు, పండ్లు పాత టెండర్‌దారులతోనే నెట్టుకువస్తున్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు సరుకులు నిలిపివేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తున్నాయి.

మెయింటెనెన్స్ గ్రాంటు లేక..

ఇదివరకు కేజీబీవీలో విద్యుత్ మరమ్మతు, ఫ్యాన్లు, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, తాగునీటి క్యాన్లు, స్టేషనరీ, రైస్, పుస్తకాల చేరివేతకు ట్రాన్స్‌పోర్టు, హమాలీ చార్జీలు పలు చెల్లింపులన్నీ స్పెషల్ ఆఫీసర్లు చెల్లించేవారు. ఇందుకు స్కూల్ అకౌంట్‌లో రూ.లక్ష వరకు ఎప్పటికి నిల్వ ఉండేవి. అత్యవసర అవసరాలు తీర్చుకునేందుకు వీలుండేది. ప్రస్తుతం నిర్వహణ నిధులు ఎస్‌వోల ఖాతాలో లేకపోవడంతో డైట్ చార్జీలు చెల్లించకపోవడం.. రోజువారీ అవసరాలు తడిసిమోపెడవుతున్నాయి. సిలిండర్లకు రూ.800 చొప్పున నెలకు దాదాపు రూ.25వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు పైమాట. అంతేకాకుండా వాటర్‌క్యాన్లు కొనుగోలు. స్టేషనరీ ఇతర ఖర్చులు అదనం. స్పెషల్ ఆఫీసర్లకు వచ్చే వేతనం రూ.32,500 కావటంతో అప్పు చేయక తప్పని పరిస్థితి. గతంలో మాదిరిగా స్కూల్ ఖాతాలో ఇంప్రెస్ట్ ఎమౌంట్ (నిర్వహణ నిధులు) రూ.లక్ష నుంచి రూ. 2 లక్షలు ఉంచితే నిర్వహణ సులభతరంగా మారనుంది. ఎస్‌వోలు ఖర్చుచేసినా డిజిటల్ పేమెంట్ చేయమంటున్నారు

రెండు రోజులుగా చెల్లింపు

కేజీబీవీల్లో సరుకులు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన జూన్ సంబంధించిన డైట్ చార్జీలు మంజూరైంది. రెండు రోజుల నుంచి చెల్లింపులు సాగుతున్నాయి. జూలై, ఆగస్టు నెలకు సంబంధించి డైట్ బిల్లులు, నిర్వహణ నిధులు వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే చెల్లింపులు చేస్తాం.

– చౌదరి, ఎఫ్ఏవో (ఫైనాన్స్ అకౌంట్ ఆఫీసర్) మంచిర్యాల

రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ కలయిక



వేడుకలో రిటైర్డ్ ఉద్యోగులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 1976లో ప్రారంభమైన కుష్టు నివారణ కేంద్రం అర్ధ శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఆ విభాగాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగుల కలయిక జిల్లాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలోని నలుమూలల నుంచి 60 నుంచి 80 ఏళ్ల వయస్సు గల రిటైర్డ్ ఉద్యోగులు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి ఆనందోత్సాహాల మధ్య గడిపారు. ముందుగా దివంగత ఉద్యోగులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ వేడుకలో రిటైర్డ్ ఉద్యోగి యూ.రామేశ్వరచారి బృందం నిర్వహించిన సంగీత విభావరిలో సందడి చేశారు. వైద్యాధికారులుగా పని చేసిన సూర్యారావు, విజయవాణిలను సన్మానించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



వినోద్ (ఫైల్)

నేరడిగొండ: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన కాడారి వినోద్ (23) ఫర్టిలైజర్ షాప్‌లో పనిచేస్తున్నాడు. గత నాలుగు రోజుల నుంచి పనికి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తండ్రి రవి ఫోన్ చేయగా సమాధానం ఇవ్వలేదు. అనుమానం వచ్చి చిన్న కుమారుడు వికాస్‌ను వెంట తీసుకుని వ్యవసాయ భూమికి వెళ్లి చూడగా పత్తి చేనులో వినోద్ అపస్మారక స్థితిలో కిందపడి ఉన్నాడు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో బోథ్ ప్రభుత్వ ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఘటన స్థలంలో మోనోసిల్ పురుగుల మందుతోపాటు థమ్సప్ బాటిల్ ఉంది. పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వివాహిత



గాదర్ల వాణి (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జీవితంపై విరక్తితో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం ప్రకారం..మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని నర్సింగాపూర్‌కు చెందిన గాదర్ల వెంకటేశ్, వాణి (30) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు హర్షవర్ధన్, ఆదిత్య ఉన్నారు. వెంకటేశ్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అయితే శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కి చీరతో ఉరేసుకుంది. మృతురాలి తల్లి తుమ్మ కళావతి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆదివారం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం 1 వద్ద దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడ్డాడు. ప్లాట్‌ఫాం, రైలు మధ్యలో ఇరుక్కుపోయాడు. గమనించిన రైల్వే సిబ్బంది అతన్ని బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సదరు వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, గ్రీన్ కలర్ రౌండ్‌నెక్ అఫ్ టీషర్ట్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నాడు.

చేపల వలలో చిక్కి జాలరి..



రవి (ఫైల్)

ఖానాపూర్: చేపల వేటకు వెళ్లిన జాలరి వలలో చిక్కుకుని మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బీర్నందికి చెందిన ఆర్మూరి రవి (38) ఆదివారం గ్రామ సమీపంలోని కడెం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో చేపల వేటకు వెళ్లాడు. అప్పటికే చేపలు పట్టేందుకు ఏర్పాటు చేసిన వలల వద్దకు తెప్పపై వెళ్లేక్రమంలో జారిపడ్డాడు. చేపల కోసం వేసిన వల అతని కాళ్లకు చుట్టుకుంది. దీంతో ఎటూ కదలలేక నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాగులో పడి యువకుడు..

కుభీర్: మండలంలోని చొండిగ్రామానికి చెందిన షేక్ ఖాసిం (28)వాగులో పడి మృతిచెందాడు. ఎస్సై క్రిష్ణారెడ్డి కథనం ప్రకారం.. ఖాసిం అనే కాపరి శనివారం పశువులను తొడ్కొని వాగుదాటుతున్నాడు. ఈక్రమంలో పక్కనే ఉన్న గుంతలో ప్రమాదవశాత్తు పడి ఈతరాక మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జ్వరంతో ఒకరు..



కిష్టయ్య (ఫైల్)

భీమారం: మండలంలోని మద్దికల్‌కు చెందిన కొర్తె కిష్టయ్య (50) జ్వరంతో బాధపడుతూ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మూడు రోజుల క్రితం కిష్టయ్య జ్వరం రావడంతో కుటుంబీకులు మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్తకణాలు తగ్గుతున్నాయని మెరుగైన చికిత్స కోసం వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రిఫర్ చేశారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, మృతుడు చిరుతల రామాయణంలో పలుమార్లు కుంభకర్ణుని పాత్ర వేసి గ్రామస్తుల మన్ననలు పొందాడు. మృతుడికి భార్య చంద్రక్క, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఎదురెదురుగా ట్యాంకర్, లారీ ఢీ



నుజ్జునుజ్జయిన లారీ

కాసిపేట: మండలంలోని సోమగూడెం దేవాపూర్ ప్రధాన రోడ్డుపై కాసిపేట జెడ్పీ పాఠశాల మూలమలుపు వద్ద ఆదివారం సాయంత్రం ట్యాంకర్, లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాలు నుజ్జునుజ్జుకాగా, డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఫిర్యాదు తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

17న బాసరకు శృంగేరి పీఠాధిపతి



మాట్లాడుతున్న గోవిందహరి

బాసర: శృంగేరి జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి మహాస్వామి ఈనెల 17, 18,19 బాసరకు విచ్చేస్తున్నారని ఈవో అంజనాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవిందహరి ఆదివారం ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర విజయ యాత్రలో భాగంగా ఆలయంలో పూజలు చేస్తారని పేర్కొన్నారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్, ఏఈ వో, ఆలయ వైదిక కమిటీతో సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆలయ వైదిక కమిటీ ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

'కడెం'లో పర్యాటకుల సందడి




బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: కడెం ప్రాజెక్ట్ పరిసరాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. వివిధ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు, మిత్రబృందంతో ప్రాజెక్ట్ అందాలను తిలకించారు. అనంతరం బోటింగ్ చేశారు.

కడెం @ 700

- గరిష్ట నీటిమట్టానికి ప్రాజెక్ట్



నిండుకుండలా కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం 700 అడుగులకు చేరింది. ప్రాజెక్ట్ నిండానీటితో కళకళాడుతుంది. గంగమ్మ ఆలయం వద్దకు, రిసార్ట్స్‌లోకి నీళ్లు చేరాయి. ఆదివారం సాయంత్రం ప్రాజెక్ట్‌కు 819 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తుంది. ఇన్ ఫ్లో పెరిగితే గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ కార్యవర్గం



సోమన్న



సునీల్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా జె.సోమన్న (ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.సునీల్‌రెడ్డి (బొల్లికుంట వీసీపీఈ ఫిజికల్ డైరెక్టర్), ఉపాధ్యక్షులుగా పి.అజయ్, ఎస్.కుమారస్వామి, బి.రమేశ్, జి.సునీత, కోశాధికారిగా ఎస్.కిరణ్‌కుమార్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.కుమారస్వామి, కె.మధుకర్, బి.వెంకట్రామ్, జె.జేత్యాతోపాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మహ్మద్ కరీం వ్యవహరించారు. నాలుగేళ్ల పాటు కార్యవర్గం కొనసాగుతుంది.

చదువులు చెప్పలేం..

- 'బెస్ట్ అవైలబుల్' పాఠశాలలకు విడుదల కాని ఫీజు బకాయిలు
- విద్యార్థులను రావద్దంటున్న యాజమాన్యాలు
- ఆందోళనలో తల్లిదండ్రులు



తోటిగూడలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ఇంద్రవెల్లి/ఉట్నూర్‌రూరల్/సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్: బెస్ట్ అవైలబుల్ ప్రైవేట్ పాఠశాలల్లోని పేద విద్యార్థుల చదువులకు ఫీజు బకాయిలు అడ్డుపడుతున్నాయి. పాఠశాలల యాజమాన్యాలకు ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులకు చదువులు చెప్పలేం.. పాఠశాలలకు రావద్దంటున్నారని యాజమాన్యాలు చెబుతున్నాయి. దసరా సెలవుల్లో ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు అక్కడే ఉంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని పాల్లుగూడ గ్రామానికి చెందిన ఆత్రం రిషి, మర్సుకోల ఆశ్విని, కొరెంగా భీంరావ్, కేస్లాగూడకు చెందిన చహకటి అంజలి, ఉట్నూర్‌లోని విద్యార్థులు, నిర్మల్ జిల్లా మామడ మండలం తోటిగూడ గ్రామానికి చెందిన పది మంది వివిధ ప్రాంతాల్లోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుతున్నారు. అయితే ఫీజులు కడితే బడికి రావాలని లేకపోతే వద్దని యాజమాన్యాలు చెబుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజులుగా వెళ్లలేదు



ఫీజులు కడితేనే రావాలని లేదంటే పాఠశాలకు రావద్దని అంటున్నారు. రెండు రోజులుగా బడికి వెళ్లలేదు. పాఠశాల ప్రారంభం నుంచి తల్లిదండ్రులు పుస్తకాలు కొని ఇచ్చారు. ఫీజులు కట్టాలని పాఠశాల యాజమాన్యం అంటే చదువులు మధ్యలోనే ఆపాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలి.

–హన్విత, 6వ తరగతి, పులాజీబాబా పాఠశాల



అ'పూర్వ'సమ్మేళనం..

సీఎస్ఐ పాఠశాలలో పూర్వ విద్యార్థులు, గురువులు

బెల్లంపల్లి సీఎస్ఐ ఉన్నత పాఠశాల (తె.మీ) 1988–89 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 37 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పూర్వవిద్యార్థులు కటకం సతీశ్, ఎల్లండి రవీందర్, గోసిక రమేశ్, కుమారస్వామి, వంశీ, మధు తదితరులు పాల్గొన్నారు. – బెల్లంపల్లి



జుమ్మెరథపేట్ పాఠశాలలో..

జుమ్మెరథపేట్ పాఠశాల పూర్వ విద్యార్థులు

జిల్లా కేంద్రంలోని జుమ్మెరథపేట్ ఉన్నత పాఠశాల 2008–09 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో ఉన్న అనుభవాలు పంచుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. – నిర్మల్‌రూరల్

గంజాయి సాగుపై పోలీసుల ఉక్కుపాదం

- డ్రోన్ సహాయంతో పర్యవేక్షణ
- కుమురంభీం జిల్లాలో 86 మొక్కలు స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు



డ్రోన్ సహాయంతో గంజాయి మొక్కలను గుర్తిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్: గంజాయి సాగుపై కుమురంభీం జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. గంజాయి సాగు నిర్మూలనే లక్ష్యంగా ఆదివారం డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. అక్రమంగా సాగు చేస్తున్న 86 మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఏఎస్పీ చిత్తరంజన్ కెరమెరి మండలంలో డ్రోన్ సహాయంతో పంట భూములను పరిశీలించారు. అంతాపూర్ గ్రామ పంచాయతీలోని నారాయణగూడ గ్రామానికి చెందిన రాథోడ్ బాలాజీ వ్యవసాయ భూమిలో 51 గంజాయి మొక్కలు గుర్తించారు. అలాగే లింగాపూర్ మండలం గుమ్నూర్(కె) గ్రామంలో ఎస్సై గంగన్న ఆధ్వర్యంలో అడె లక్ష్మణ్ పత్తి పొలంలో సాగు చేస్తున్న 35 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. గంజాయి సాగు, రవాణా, అమ్మకం, వినియోగం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో 51 కేసులు నమోదు కాగా, 560 మొక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రోన్‌తో పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో వాంకిడి సీఐ సత్యనారాయణ, కెరమెరి ఎస్సై మధుకర్ పాల్గొన్నారు.

ముగిసిన సెపక్‌తక్రా పోటీలు

- విజేతగా జూనియర్స్ విభాగంలో ఆదిలాబాద్ బాలికల జట్టు
- బాలురలో రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానం
- సబ్ జూనియర్స్ పోటీలో వరంగల్ బాలికల జట్టు
- బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా



ఆదిలాబాద్ బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఇన్‌చార్జి నరేందర్

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి జూనియర్స్, సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన చివరిరోజు ఫైనల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టు, సబ్ జూనియర్స్‌లో వరంగల్ బాలికల జట్టు, మహబూబ్‌నగర్ బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక జూనియర్స్ విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలవగా సబ్ జూనియర్స్‌లో ఆదిలాబాద్ బాలుర, బాలికల జట్లు మూడో స్థానంలో నిలిచాయి. విజేతగా నిలిచిన జట్లకు బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్ ట్రోఫీతోపాటు షీల్డ్‌లు అందజేశారు.

నిరంతర సాధనతోనే విజయాలు..

అంతకుముందు పోటీల ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్ హాజరై మాట్లాడారు. క్రీడాకారులు ఆటలో నైపుణ్యాలు మెరుగుపర్చుకునేందుకు నిరంతర సాధనతోనే అద్భుత విజయాలు సొంతమవుతాయన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి విజయ భాస్కర్‌రెడ్డి, జారీఫ్ ఉద్దీన్‌ఖాన్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్.తిరుపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాస్కర్, రామకృష్ణ, కుమ్మరి మల్లేశ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, ఎస్సై వెంకటకృష్ణ పాల్గొన్నారు.